
సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం : 10 : అక్టోబర్ : 2024



వేళకు రారు..

ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులు స్థానికంగా ఉండకపోవడం, వేళకు విధులకు హాజరుకాకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. IIలో ▸



ఆక్వాకు ఆక్సిజన్ గండం

పూటకోరకంగా మారుతున్న వాతావరణం ఆక్వా సాగుకు గండంగా మారింది. నెల రోజులుగా రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. IIలో ▸



డ్రోన్ల వినియోగంతో ఆదా

ఉద్యాన పంటల్లో వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై బుధవారం నూజివీడు, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలాల్లో రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. IIలో ▸

న్యూస్‌రీల్

నేడు ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశం



డీఎన్నార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

కైకలూరు: ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవలంభించాల్సిన విధివిధానాలపై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు రైల్వేస్టేషన్ సమీప నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.గౌతమ్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా 289.4 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లా వ్యాప్తంగా 289.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉండిలో అత్యధికంగా 42.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా తాడేపల్లిగూడెంలో 13.6, పెంటపాడులో 12.2, తణుకులో 9.2, అత్తిలిలో 6.2, గణపవరంలో 25.2, ఆకివీడులో 8.8, పాలకోడేరులో 15.4, ఇరగవరంలో 38.2, పెనుగొండలో 7.8, వీరవాసరంలో 15.2, భీమవరంలో 28.8, కాళ్లలో 20.2, మొగల్తూరులో 10.4, పాలకొల్లులో 21.4, యలమంచిలిలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం: బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు నేషనల్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని వెనుకబడిన తరగతులు సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10, ఇంటర్మీడియట్ చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచారజాతుల కులాలకు చెందిన విద్యార్థులు పీఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలకు మించరాదని, దరఖాస్తుల సమర్పణకు సబంధించిన పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

భీమవరం: మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 11 వరకు పొడిగించారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమరేశన్ చెప్పారు. బుధవారం భీమవరం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నూతన మద్యం విధానం అమలుచేస్తున్నందును ఆన్‌లైన్‌తో సహా నేరుగా దరఖాస్తులను 11వ తేదీ కల్లా అందజేయవచ్చునన్నారు. 14వ తేదీన మద్యం షాపుల కోసం లాటరీ తీసి కేటాయింపు ప్రకియను పూర్తి చేస్తామని చెప్పారు.

నేటి నుంచి నిత్యావసరాల విక్రయం

భీమవరం(ప్రకాశం చౌక్) గురువారం నుంచి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం రైతు బజారు సెంటర్లలో నిత్యావసరాల విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. రైతుబజార్లలో టమోటా, ఉల్లిపాయలు, వంట నూనెలు అమ్మడానికి ఏర్పాట్లు చేశామన్నారు. టమోటాలు కిలో రూ.50, ఉల్లిపాయలు కర్నూలు రకం రూ.32, మహారాష్ట్ర రకం రూ.47, పామాయిల్ (850 గ్రాముల ప్యాకెట్) రూ.119, సన్ ఫ్లవర్ (910 గ్రాముల ప్యాకెట్) రూ.127కు అమ్ముతారని చెప్పారు.

ప్రయాణం.. నిత్యం నరకమే

- జిల్లాలో భారీ వర్షాలకు 405 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు
- ప్రధాన రహదారులన్నీ గోతులమయం..
- కనీస మరమ్మతులు లేక ప్రయాణికుల అవస్థలు



భీమవరం మున్సిపాలిటీ పరిధిలో అధ్వానంగా శ్రీరామపురం రోడ్డు



తాడేపల్లిగూడెం-నిడదవోలు రోడ్డులో అడుగడుగునా గుంతలే



వేండ్ర-అండలూరు రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అడుగు తీసి అడుగు వేయాలంటే గుంతల్ని చూసుకుంటూ జాగ్రత్తగా వెళ్లాల్సిందే.. ఆదమరిస్తే అంతే సంగతులు.. గత మూడు నెలలగా కురిసిన వర్షాలకు జిల్లాలోని రోడ్లు గోతులతో అధ్వానంగా తయారయ్యాయి. గత ప్రభుత్వంలో మరమ్మతులు చేసిన రోడ్లు సైతం వర్షాల దెబ్బకు పాడయ్యాయి. అడుగు మేర గోతులు ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్నా.. ఏ ఒక్క నాయకుడికి చీమ కుట్టినట్లయినా లేదు. నిత్యం ఈ రోడ్లపై ప్రయాణం చేస్తున్న వారి బాధలు వర్ణణాతీతం.

405 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు

వర్షాలకు జిల్లాలో మొత్తం 405 కిలోమీటర్లు మేర రోడ్లు దెబ్బతిన్నట్లు ఆర్ అండ్ బీ అధికారులు అంచనా వేశారు. ఇందులో రాష్ట్ర రహదారులు, జిల్లా రహదారులు ఉన్నాయి. రాష్ట్ర రహదారులు 227.343 కిలోమీటర్లు, ఎండీఆర్ రోడ్లు 177.921 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. జిల్లాలో దారుణంగా దెబ్బతిన్న 62 రోడ్లకు మరమ్మతులు వెంటనే చేయాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

కళ్లు మూసుకున్న కూటమి ప్రభుత్వం

వర్షాలకు జిల్లాలో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నా కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకుని నటిస్తోంది. కనీస మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదు. దాంతో రోడ్లపై గోతులు చెరువుల్లా మారిపోతున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు కొన్ని రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని ఆలోచన చేస్తున్నా మరమ్మతులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో రోడ్లపై ఉన్న గోతుల్లో నాట్లు వేసి ధర్నాలు చేసిన జనసేన, టీడీపీ నాయకులు చెరువుల్లాంటి ఈ గోతుల వైపు కనీసం చూడడం లేదు. వర్షాలు పడుతున్నాయని, మరమ్మతులు చేయడం కుదరదని అధికారులు చెబితే జగన్ ప్రభుత్వంపై బురదజల్లిన నేటి ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎందుకు స్పందిచడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి

జిల్లాలోని మున్సిపాలిటీల్లో కూడా కొన్ని రోడ్లు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నాలుగు నెలల కాలంలో జిల్లాలో ఏ మున్సిపాలిటీలో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దాంతో పట్టణాల్లో ఉండే ప్రజలు కూడా అధ్వానంగా ఉన్న రోడ్లపై ప్రయాణం చేయలేక ఇక్కట్లు పడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన రోడ్లపై రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి



పెనుగొండలో ధాన్యం కొనుగోళ్లపై సూచనలు చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుగొండ: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ధాన్యం కొనుగోళ్ల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద ముందుగానే మిల్లర్ల నుంచి గన్నీ బ్యాగ్‌లు తెచ్చుకోవాలన్నారు. మిల్లర్లు ఎలాంటి ఆటంకాలు పెట్టకుండా తేమ పరీక్షలు కరక్టుగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, వ్యవసాయాధికారి పి.స్పందన, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఆచంట తహసీల్దారు కార్యాలయంలో మూడో విడత శిక్షణ తహసీల్దారు ఎం.సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. పోడూరు మండలంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ఆశయ సాధనే లక్ష్యం
- ప్రజల్లో కూటమి పాలనపై తీవ్ర వ్యతిరేకత
- జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో డీఎన్నార్
- హాజరైన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు



ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో రాబోయే కాలంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి పార్టీ జెండా ఎగరేయడం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు నగరంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కార్యాలయం, ఏలూరు నగర కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప అప్పారావు, కంభం విజయరాజు, మామిళ్లపల్లి జయప్రకాష్, భారీగా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలోని యువతను చూస్తే ఉత్సాహం వస్తుందని, వాళ్లకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండాలు మోసిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల సాధనకు జిల్లాలోని ప్రతి కార్యకర్త, నాయకుడు కృషిచేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో మాజీ ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసి చూపించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం 4 నెలలు అవుతున్నా సూపర్-6 లో ఎన్ని పథకాలు అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు: జేపీ

ఏలూరు నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ....నగరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, నియోజకవర్గ కార్యాలయాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలను గుర్తించి జగనన్న నాయకత్వాన్ని ఇస్తారనేందుకు నిదర్శనం తామే అన్నారు. నూజివీడు సమన్వయకర్త మేకా ప్రతాప అప్పారావు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో పార్టీ కార్యాలయం ఏర్పాటుతో నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. జిల్లాలోని 6 నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త హాజరై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

వయోవృద్ధుల సంక్షేమ చట్టం అమలుపై సమీక్ష

ఏలూరు (మెట్రో): వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపదని కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో వయో వృద్ధుల సంక్షేమ చట్టం అమలుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2007లో ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణకు చట్టం అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. 2011, 2022లో ఆ చట్టాన్ని మరింత పటిష్టంగా సవరించారన్నారు. వయోవృద్ధుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు బి.రామ్ కుమార్, రెవెన్యూ డివిజినల్ అధికారులు పాల్గొన్నారు.

హద్దుల్లేని మద్యం సిండికేట్లు

- నియోజకవర్గాల్లో బయటివాళ్ల దరఖాస్తుల దాఖలుపై అభ్యంతరం
- అధికార పార్టీ ఎమ్మెల్యేల వద్ద కొత్త పంచాయితీ
- మద్యం షాపులకు ఏలూరు జిల్లాలో 3,814, పశ్చిమలో 3,490 దరఖాస్తులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: మద్యం సిండికేట్ల దందా నియోజకవర్గాలు దాటి ఉమ్మడి జిల్లాకు విస్తరించింది. ఒక్కో సిండికేట్ సగటున 7 నియోజకవర్గాల వరకు టెండర్లు దాఖలు చేస్తుండటంతో ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. రెండు రోజుల క్రితం వరకు సింగిల్ టెండర్లతోనే దక్కించుకునేలా అనేక నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారు. పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. భారీగా దరఖాస్తులు నమోదు కావడంతో ప్రజాప్రతినిధుల వద్ద హద్దు తేలకపోవడం హాట్ టాఫిక్‌గా మారింది. ప్రధానంగా రెండు జిల్లాల్లో బడా సిండికేట్లు అత్యధిక దరఖాస్తులు దాఖలు చేయడంతో స్థానికంగా అభ్యంతరాలు పెరుగుతున్నాయి.

తక్కువ దరఖాస్తులతో గడువు పెంపు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు బుధవారంతో ముగియాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ సిండికేట్లతో తక్కువ సంఖ్యలో దరఖాస్తులు పడడంతో మరో రెండు రోజులు గడువు పెంచి 11న చివరి రోజుగా, 14న లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో ఏలూరు జిల్లాలోని 144 షాపులకు ఇంతవరకు 3814 దరఖాస్తులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 175 షాపులకు ఇంతవరకు 3,490 దరఖాస్తులు స్వీకరించారు. అయితే మేజారిటీ సిండికేట్ల దరఖాస్తులు మంగళ, బుధవారాల్లో పడటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది.

ప్రజాప్రతినిధుల వద్ద పంచాయితీలు

సిండికేట్లు భారీగా దరఖాస్తులు దాఖలు చేయడంతో ఎమ్మెల్యేల వద్ద పంచాయితీలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా కైకలూరు, ఉంగుటూరు, చింతలపూడిలో ఈ ధోరణి ఎక్కువగా ఉంది. నియోజకవర్గానికి సంబంధించిన టీడీపీ నేతలు కాకుండా బయటవాళ్లు అనుమతులు లేకుండా దాఖలు చేయడంపై నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పూర్తి స్థాయిలో ఎవరు దాఖలు చేశారనే స్పష్టత లేని క్రమంలో సిండికేట్ల వారీగా ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారు. నియోజకవర్గంలో షాపు దక్కించుకుంటే 25 శాతం కమిషన్ తప్పనిసరిగా ఇవ్వడంతో పాటు సూచించిన వారికి వాటాలు ఇవ్వాలని డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ముఖ్య సిండికేట్లకు కొందరు ప్రజాప్రతినిధులు ఇప్పటికే ఫోన్లు చేశారు. ఏలూరు, దెందులూరు ప్రజాప్రతినిధులు ఏకంగా తమ దగ్గర దరఖాస్తు దాఖలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ముందుస్తుగానే హెచ్చరికలు జారీ చేశారు.

ఏలూరు, దెందులూరులో స్థానికులదే హవా

జిల్లా వ్యాప్తంగా 3,814 దరఖాస్తులు అందినప్పటికీ ఏలూరు, దెందులూరుకు మాత్రం రాజకీయ ఒత్తిడితో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు దాఖలు లేదు. కేవలం ప్రజాప్రతినిధి అనుమతి ఉన్నవారు మాత్రమే దరఖాస్తులు దాఖలు చేశారు. ఏలూరు నగరంలో 21 షాపులకు 7 రోజుల వ్యవధిలో 160 దరఖాస్తులు, దెందులూరు నియోజకవర్గంలో 20 షాపులకు 140 దరఖాస్తులు మాత్రమే అందాయి. జిల్లా వ్యాప్తంగా మిగిలిన అన్ని చోట్ల ఒక్కొక్క షాపు సగటున 10 వరకు దరఖాస్తులందాయి. ఒక్క ద్వారకాతిరుమల మండలంలో 5 షాపులకు ఇప్పటి వరకు అత్యధికంగా 256 దరఖాస్తులు అందాయి. పోలవరం నియోజకవర్గంలో ఒక్క షాపునకు 70 దరఖాస్తులు అందాయి. కైకలూరు మండలంలో ఒకే షాపునకు 50 దరఖాస్తులు పడ్డాయి.

బలుసులమ్మకు బంగారు కలికితురాయి



కలికితురాయిని చూపుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : భక్తులు 369 గ్రాముల బంగారంతో తయారు చేయించిన స్వర్ణ కలికితురాయిని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు బుధవారం బలుసులమ్మ అమ్మవారికి సమర్పించారు. కలికితురాయితోపాటు భక్తులు సమర్పించిన వెండితో తయారు చేయించిన పూజా సామగ్రిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొట్టు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొట్టు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జీవించాలని అభిలషించారు. దివంగత మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు గతంలో శ్రీ బలుసమ్మ అమ్మవారికి నూతన ఆలయ నిర్మాణం చేపట్టారన్నారు. తాను ఉపముఖ్యమంత్రి హోదాలో ఆలయంలో అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన 200 కిలోల వెండితో ఉయ్యాల, వడ్డాణం, కిరీటం, తదితర వస్తువులు తయారు చేయించామన్నారు. స్వర్ణ మంగళసూత్రాలు, కలికుతురాయి అందచేశామన్నారు. బలుసులమ్మకు సమర్పించిన వెండి, బంగారం వివరాలను దాతల పేర్లుతో బోర్డులు ఏర్పాటు చేయాలని గతంలో ఆదేశాలిచ్చామని.. ఇప్పటికైనా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వాసవీ మాత ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, గాయత్రీ ఆలయం, బాల కనకదుర్గ ఆలయాలను దర్శించుకున్నారు.



భీమవరం(ప్రకాశంచౌక్): సరస్వతీదేవి అలంకరణలో మావుళ్లమ్మ



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం పీఠంలో అక్షరాభ్యాసానికి హాజరైన తల్లిదండ్రులు, చిన్నారులు



భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం

చదువుల తల్లి చల్లని దీవెన



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలో చిన్నారితో అక్షరాలు రాయిస్తున్న తల్లిదండ్రులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో విద్యార్థులతో సరస్వతీ పూజ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి అనుగ్రహం పొందేందుకు తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు అట్టహాసంగా నిర్వహించారు. బాసర తర్వాత మేధా సరస్వతీ నిలయమైన ఈ పీఠానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో సుమారు 580 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆలయాల్లో అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారికి చోటు


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన శేష్ఠ అన్విత

మండవల్లి: మండవల్లి మండలం ఆనందపురం గ్రామానికి చెందిన చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఇంటి పవన్‌కుమార్, ప్రమీల దంపతుల కుమార్తె శ్రేష్ఠ అన్విత (4) కైకలూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదవుతోంది. ఇంగ్లిషు అక్షరాలను వాటి సంఖ్యాపరంగా వరుసగా కేవలం పదమూడు సెకండ్ల పదిహేడు మిల్లి సెకండ్లలో పలికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. చిన్నారి ప్రతిభపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి సేవలో...


తల్లిదండ్రులతో సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రముఖ సినీ దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల బుధవారం సందర్శించారు. తల్లిదండ్రులతో కలసి ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

ప్రమాదవశాత్తూ కాల్వలో పడి..

చాట్రాయి: ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామానికి చెందిన ములగాల రామకృష్ణ (26) బుధవారం తన ద్విచక్ర వాహనంపై చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మీద వెళ్తున్నాడు. కాల్వ గట్టుపై ఉన్న గొయ్యిలో ద్విచక్రవాహనం పడడంతో అదుపు తప్పి కాల్వలో పడిపోయాడు. రెండు గంటల తర్వాత కాల్వ గట్టుమీద చెప్పులు, వాహనం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విస్సన్నపేట అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు రామకృష్ణకు భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. అతడికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

పాము కాటుకు బాలిక మృతి


లాస్య (ఫైల్)

చాట్రాయి : పాము కాటుకు ఓ బాలిక మృతి చెందింది. చాట్రాయి మండలంలోని సి గుడిపాడు గ్రామానికి చెందిన విస్సంపల్లి రవి, జయమ్మలకు లాస్య, యాసిన్ సంతానం. 5వ తరగతి చదువుతున్న లాస్య(11) బుధవారం ఉదయం ఇంటి వెనుక గుమ్మం వద్ద రాళ్లపై కూర్చొని బ్రష్ చేసుకుంటుంది. అక్కడ ఉన్న పామును చూసి అరిచింది. దీంతో ఇంట్లో ఉన్నవారు వచ్చి పాముని చంపేశారు. అయితే పాము కాటువేసిన సంగతి బాలిక గమనించలేదు. గంట తర్వాత లాస్య స్పృహ తప్పిపోతుండడాన్ని తల్లిదండ్రులు గమనించి అంబులెన్స్‌లో విస్సన్నపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

వేళకు రారు.. అందుబాటులో ఉండరు

- ఇదీ పశ్చిమగోదావరి జిల్లా సర్కారు దవాఖానాల్లో వైద్యుల పరిస్థితి
- ఆలస్యంగా విధులకు హాజరవుతున్న వైద్యులు
- వైద్యుల తీరు మారాలంటూ కలెక్టర్ ఆదేశాలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులు స్థానికంగా ఉండకపోవడం, వేళకు విధులకు హాజరుకాకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీసీహెచ్ఎస్) వైద్య ఆరోగ్యశాఖ రెండు విభాగాల్లో సుమారుగా 187 మంది వరకు వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. వీరిలో కొందరు స్థానికంగానే ఉంటూ సమయపాలన పాటిస్తున్నా, మరి కొందరు మాత్రం ఒక జిల్లాలో పనిచేస్తూ మరొక జిల్లాలో నివాసముంటూ రోజూ విధులకు ఆలస్యంగా వస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అత్యవసర వైద్యసేవలందేనా...

ముఖ్యంగా భారీ ప్రమాదాలు సంభవించినా, ప్రకృతి విపత్తు, అగ్ని ప్రమాదాల్లో అధికశాతం బాధితులు ఉన్న సందర్భాలు ఎదురైన పరిస్థితుల్లో ఆస్పత్రుల్లో ఉన్న వైద్యులంతా కలిసి అత్యవసర వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. కానీ కొందరు వైద్యులు ఆస్పత్రులు ఉన్న ప్రాంతాల్లేనే కాదు కదా ఏకంగా జిల్లాలు దాటి ప్రయాణాలు చేస్తున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. 60 శాతం పైగా వైద్యులు స్థానికంగా ఉండడంలేదనే విషయం జిల్లా వైద్యాధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా డీసీహెచ్ఎస్ పరిధిలోని కొందరు వైద్యులు అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇతర ప్రాంతాల నుంచి కార్లు, రైళ్లు, బస్సుల ద్వారా ప్రయాణాలు చేస్తూ సమయానికి విధులకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారే కానీ స్థానికంగా ఉండేందుకు ససేమిరా అన్నట్లుగా ఉన్నారని వైద్యవర్గాలు ఆరోపిస్తున్నాయి. పనిచేసే చోట ఉంటున్నారనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం హౌస్ అలవెన్స్ ఇస్తున్నాకానీ కొందరు వైద్యులు ఆ సౌకర్యం పొందుతూనే వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న దుస్థితి. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి కొందరు వైద్యులు స్థానికంగా ఉండకపోగా నియోజకవర్గాల హెడ్ క్వార్టర్స్‌లో క్లినిక్‌లకు బదులుగా భారీ భవనాలను అద్దెకు తీసుకుని వైద్యశాలలు నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని, ఎవరైనా ఫిర్యాదుచేస్తే చూద్దామన్నట్లుగా వ్యవహరిస్తున్నారని సాక్షాత్తూ వైద్యసిబ్బంది చెబుతుండడం విశేషం. విధుల్లో ఉండాల్సిన సమయాల్లో కూడా ప్రైవేటు క్లినిక్‌లు, వైద్యశాలల్లో ప్రైవేటు వైద్యం చేసుకుంటున్నారంటూ జిల్లా వ్యాప్తంగా కొందరి వైద్యులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తణుకు నియోజకవర్గంలోని కొందరు వైద్యులు దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకోవాలనే ఆరాటంతో ప్రైవేటు వైద్యశాలలు నిర్వహిస్తూ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్‌గా కూడా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

పశ్చిమలో ప్రభుత్వ వైద్యశాలలు

జిల్లా ఆరోగ్యకేంద్రం	1
ఏరియా ఆస్పత్రులు	5
కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు	3
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	34
యూపీహెచ్‌సీలు	18

కలెక్టర్ ఆదేశాలు ఆచరిస్తారా..?

కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈనెల 5వ తేదీన భీమవరంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్యులంతా పనిచేసేచోట స్థానికంగానే నివాసం ఉండాలని, ప్రైవేటు ప్రాక్టీసు కూడా వదిలేయండంటూ హెచ్చరించారు. అయితే ఇప్పటికీ వేరే ప్రాంతంలో ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు తమ తీరు ఏమేరకు మార్చుకుంటారో, కలెక్టర్ ఆదేశాలు ఎంతమేర ఆచరణకు నోచుకుంటాయో వేచిచూడాల్సిందే.

పనిచేసే చోటే నివాసం ఉండాలి

వైద్యులంతా పనిచేసే చోటే నివాసం ఉండాలనే ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం వైద్యులు స్థానికంగానే ఉండేలా, ప్రైవేటు వైద్యానికి దూరంగా ఉండే విధంగా ఇకపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ వైద్యులు వైద్యశాలలు నిర్వహించడం తగదు.

– డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్‌వో

డ్రోన్ల వినియోగంతో ఖర్చు ఆదా


అరటి పంటలో డ్రోన్ ద్వారా రసాయన మందుల పిచికారీ గురించి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నూజివీడు : డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ చేయడం ద్వారా సమయాన్ని, ఖర్చులను తగ్గించుకోవచ్చని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మీ అన్నారు. వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని నూజివీడు మామిడి పరిశోధన స్థానం, వెంకట్రామన్నగూడెంలోని కృషీ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యాన పంటల్లో వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై బుధవారం నూజివీడు, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా 23 ఎకరాల్లో సాగు చేసిన మామిడి, అరటి, గుమ్మడి పంటల్లో డ్రోన్ల ద్వారా పోషకాలు, పురుగు, తెగుళ్ల మందులు పిచికారీ చేసి క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్ ద్వారా పురుగు మందులను పిచికారీ చేయడం వల్ల పురుగుమందు ఆదా కావడమే కాకుండా సమయాన్ని, ఖర్చులను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. సాధారణంగా ఒక ఎకరానికి 200 లీటర్లు అవసరం అయ్యే నీటిని డ్రోన్ ద్వారా కేవలం 10 లీటర్ల నీటితో ఒక ఎకరానికి పిచికారీ చేయవచ్చన్నారు. సిఫార్సు చేసిన పురుగు మందుల మోతాదులో 75 శాతం మాత్రమే వినియోగించి పురుగు మందు మోతాదును తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయ డ్రోన్లను వినియోగించి కేవలం 10–15 నిమిషాలలో ఒక ఎకరం పిచికారీ చేయవచ్చునని అదే విధంగా రసాయనాల ప్రభావం పిచికారీ చేసే వారిపై పడదన్నారు. ఈ కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త జీ శాలిరాజు, మృతిక శాస్త్రవేత్త ఎం. రాఘవేంద్రరెడ్డి, నూజివీడు, విసన్నపేట ఉద్యాన అధికారులు నరేంద్ర, హేమ, క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చోరీ గ్యాంగ్‌లను త్వరలో పట్టుకుంటాం

ఎస్పీ నయీం అస్మి


పట్టణ సీఐ కార్యాలయంలో సీసీ కెమెరాల వ్యవస్థ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

నరసాపురం : ఇటీవల జిల్లాలో జరుగుతున్న చోరీలపై గట్టి నిఘా పెట్టామని ఎస్పీ నయీం అస్మి వెల్లడించారు. బుధవారం ఆయన నరసాపురం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. కేసుల పురోగతిపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. దొంగతనాలు వేరే రాష్ట్రాల ముఠాలు చేస్తున్నాయా? ఇక్కడివారే చేస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుందని చెప్పారు. చోరీల ముఠాలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఇక జిల్లాలో బెట్టింగ్ వ్యవహారాల కట్టడికి సైబర్ క్రైమ్ విభాగం చురుగ్గా పనిచేస్తోందని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌లపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఏ రూపంలో అయినా జూదాలకు సంబంధించిన అంశాన్ని తేలిగ్గా తీసుకోబోమని, ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. జిల్లాలో పేకాట క్లబ్‌లకు ఎక్కడా అనుమతులు లేవన్నారు. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. కొత్త వ్యక్తులతో ఇటీవల గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ దిశగా కూడా నిఘా ఉంచామని చెప్పారు. గంజాయి నియంత్రణకు విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. టౌన్, రూరల్ సీఐలు యాదగిరి, శ్రీనివాస్, ఎస్సైలు జయలక్ష్మి, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఆక్వాకు ఆక్సిజన్ గండం

- పూటకో రకంగా మారుతున్న వాతావరణం
- విపరీతమైన ఉక్కపోత, అకాల వర్షాలతో అనర్థం
- నెల రోజులుగా ఇదే పరిస్థితి
- ఆక్సిజన్ అందక చనిపోతున్న రొయ్యలు, చేపలు


చెరువులలో తిరుగుతున్న ఏరియేటర్లు


ఆక్సిజన్ అందక చనిపోయిన చేపలు

గణపవరం: పూటకోరకంగా మారుతున్న వాతావరణం ఆక్వా సాగుకు గండంగా మారింది. ఇటీవల దారుణంగా పడిపోయిన చేపలు, రొయ్యల ధరలు పెరిగి ఆక్వారంగం కుదుటపడుతున్న సమయంలో.. నెల రోజులుగా కనిపిస్తున్న వాతావరణ మార్పులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వేసవిని మించిపోయి విపరీతమైన ఎండలు ఒకపక్క, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మరోపక్క ఆక్వా సాగును కుదేలు చేస్తున్నాయి. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి. ఎండకాస్తే విపరీతమైన ఉక్కపోత, ఎండ తీవ్రత వల్ల చెరువులలో ఆక్సిజన్ సమస్య తలెత్తుతుంది. అప్పటికప్పుడు ఉన్నట్టుండి ఎండమాయమై, మబ్బులు కమ్మి ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. రోజూ ఇదే పరిస్థితి. దీనితో ఆక్సిజన్ సమస్య తలెత్తి కొన్నిచోట్ల చేపలు, రొయ్యలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు నిరంతరం చెరువులలో ఏరియేటర్లు తిప్పుతున్నారు. చెరువులలో ఇంజిన్లు వేసి నీటిని రీసైక్లింగ్ చేస్తూ, నిరంతరం నీటిలో కదలిక తేవడం వల్ల ఆక్సిజన్ సమస్యను కొంతవరకూ అధిగమిస్తున్నారు. రసాయనాలు సైతం చల్లుతున్నారు. ఆక్సిజన్ అందక చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినలేక నీరసించిపోతుండటంతో రైతులు యుద్ధప్రాతిపదికన పట్టివేసి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో రొయ్య, మరో 1.50 లక్షల ఎకరాల్లో చేపల సాగు జరుగుతోంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో చేపలు, రొయ్యలు మృత్యువాత పడినట్లు అంచనా.

మత్స్యశాఖ అధికారుల సూచనలు

చెరువులలో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ నీటిని రీసైక్లింగ్ చేయాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆక్సిజన్ లోప నివారణకు పొటాషియం పర్మాంగనేటు సిద్ధంగా ఉంచుకుని, అవసరం మేరకు చెర్వులో చల్లుతుండాలన్నారు. ఆక్సిజన్ సరిపడా అందక చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినవని, ఇది గమనించి మేతలు పరిమితంగా వేస్తుండాలన్నారు. ఆక్సిజన్ సమస్య ఉన్న సమయంలో చెరువులలో మేత, సేంద్రియ ఎరువులను వేయడం పూర్తిగా మానివేయడం మంచిదని సూచించారు.

క్షీరారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలోని సరస్వతి దేవి మండపం వద్ద చిన్నారులు సరస్వతి పూజ నిర్వహించారు. దాతలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముత్యాల శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారి ఇంట్లో చోరీ

నరసాపురం: నరసాపురంలో ఓ ప్రభుత్వ అధికారి ఇంట్లో దొంగతనం జరిగింది. పట్టణంలోని 29వవార్డులో నివాసం ఉంటున్న రాపాలక చిట్టి ఆనంద్‌కుమార్ మచిలీపట్నం జెడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఈనెల 2వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్లిన ఆయన బుధవారం మధ్యాహ్నం 11 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. లోపలకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండడం, 22 గ్రాముల బంగారం, 760 గ్రాముల వెండి వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టౌన్ ఎస్సై జయలక్ష్మి తెలిపారు.

అన్నప్రసాదానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ రూ.1,0,1,116 విరాళాన్ని నగదు రూపంలో బుధవారం అందజేశారు. దేవస్థానం తరుపున దాతకు సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ పత్రాన్ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

దసరా ఉత్సవాల్లో అసభ్యకర నృత్యాలు

సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న యువకుడిని కొట్టిన కమిటీ సభ్యులు


సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోన్న వీడియో


ప్రభుత్వాసుపత్రిలో ప్రేమ్‌సాగర్

కలిదిండి(కైకలూరు): దసరా ఉత్సవాల్లో ఎటువంటి అశ్లీల, అసభ్యకర నృత్యాలు చేయకూడదని జిల్లా ఎస్పీ పదేపదే హెచ్చరిస్తున్నా కొందరు కమిటీ సభ్యులు మాటవినడం లేదు. ఏలూరు జిల్లా కోట కలిదిండిలో 30వ వార్షికోత్సవ దసరా మహోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి మ్యూజికల్ నైట్, డాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేశారు. ఇదే మండలం పోతుమర్రు పంచాయతీ గొల్లగూడెం నుంచి 10 మంది మైనర్ యువకులు కార్యక్రమాన్ని తిలకించడానికి కోట కలిదిండి వచ్చారు. డాన్సులను సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తుండగా కమిటీ సభ్యులు సెల్‌ఫోన్లు లాక్కున్నారు. పడమటి ప్రేమ్‌సాగర్ అనే యువకుడుని కొట్టారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ప్రేమసాగర్ తల్లి పడమటి వెంకటరమణ తాగిన మైకంలో తన బిడ్డను పేటేటి సత్యనారాయణ, గంధం వాసు, చిట్టూరి పరుశురాం, సుబ్బారావులు కొట్టారని కలిదిండి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. తన కుమారుడితో పాటు మరో యువకుడిని బంధించి హింసించారని సెల్‌ఫోన్లు లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం కొడుకును కై కలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువెళ్లింది. దోషులను కఠినంగా శిక్షించాలని కోరింది.

నృత్యాలు వీడియో ఇప్పటిది కాదు

వాస్తవానికి ఈ నెల 5న అదే స్టేజీమీద మ్యూజికల్ నైట్‌లో నృత్యాలు జరిగినట్లు ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీనిపై ఏలూరు డీఎస్పీ, సీఐలు విచారణ చేస్తున్నారు. నిర్వాహకులపై యువకులపై దాడి, అసభ్యకర నృత్యాల ప్రదర్శనపై కేసుల నమోదుకు పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. దీనిపై కలిదిండి ఎస్సై వేంకటేశ్వరరావును వివరణ కోరగా మంగళవారం గొడవ జరిగిన మాట వాస్తవమేనని అందుకు బాధ్యులైన వారిపై విచారించి కేసులు నమోదు చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్న అసభ్యకర నృత్యాలు వీడియో ఇప్పటిది కాదని ఆయన స్పష్టం చేశారు.

ఆటో తిరగబడి కూలీలకు గాయాలు

పాలకోడేరు: ఆటో తిరగబడి కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం భీమవరం మండలం యమునాపల్లి గ్రామానికి చెందిన మహిళలు పాలకోడేరు మండలం గొల్లలకోడేరులోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం పని ముగించుకుని ఆటోలో ఇంటికి వెళుతుండగా ఫ్యాక్టరీకి కూతవేటు దూరంలోనే ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో యమునాపల్లి గ్రామానికి చెందిన ఎం అగ్నిసమ్మ (45), దుర్గ (43)లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆటోలో ఎంతమంది ప్రయాణిస్తున్నది తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పాలోకోడేరు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని సైక్లిస్ట్ మృతి


ప్రమాద స్థలంలో దుర్గాప్రసాద్ మృతదేహం

నరసాపురం: లారీ ఢీకొని ఓ సైక్లిస్ట్ మృతి చెందాడు. నరసాపురంలోని శ్రీహరిపేటకు చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్ (49) ఓ హోటల్‌లో సప్లయిర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి సైకిల్‌పై వెళుతుండగా పట్టణంలోని 216 జాతీయ రహదారిపై శ్రీసూర్యా కళాశాల సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గాప్రసాద్‌కి మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటకి సమీపంలోనే ప్రమాదం జరగడంతో భార్య, పిల్లలు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టౌన్ ఎస్సై జయలక్ష్మి చెప్పారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం



కాళ్ల: పంటబోదేలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. కాళ్ల మండలం ప్రాతాళ్ళమెరక గ్రామంలో దీపాటి వజ్రమ్మ ఇంటి సమీపంలోని ఒక పంటబోదెలో బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సుమారు 7 నుంచి 8 నెలల వయసు గల మగశిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాళ్ల పోలీసు సిబ్బంది పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీశారు. వజ్రమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గల్లంతైన 'భవానీ' మృతదేహం లభ్యం


దుర్గాప్రసాద్ మృతదేహం

తణుకు: ప్రమాదవశాత్తూ కాలువలో పడి గల్లంతైన తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన భవానీ మాలధారుడు కాజా దుర్గాప్రసాద్ (23) మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. పైడిపర్రు వంతెన వద్ద ఈ మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న దుర్గాప్రసాద్ మూడు నెలల క్రితం ప్రేమవివాహం చేసుకుని తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. భవానీ మాల ధరించిన అతడు మంగళవారం రాత్రి స్నానం చేసేందుకు కాల్వలోకి దిగి కొట్టుకుపోయాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది తోపాటు స్థానికులు గాలించగా బుధవారం దుర్గాప్రసాద్ మృతదేహం లభించింది. తణుకు రూరల్ ఎస్సై జీఎస్‌వీ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు


లారీని ఢీకొట్టిన కారు

పాలకోడేరు: ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం అన్నవరం నుంచి గుడివాడ వెళుతున్న కారు పాలకోడేరు మండలం శృంగవృక్షం రైల్వే గేట్ సమీపంలో అదుపుతప్పి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పి.లక్ష్మీబాయి (59), టి తేజస్విని (26) టి జగదీష్(33)లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. క్షతగాత్రులలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

కాన్షీరాంకు ఘన నివాళులు



తణుకులో కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.

తణుకు అర్బన్: కాన్షీరాం 16వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ అంబేద్కరిజాన్ని భుజాన ఎత్తుకుని మనువాదాన్ని చిత్తుగా ఓడించిన రాజకీయ వీరుడు కాన్షీరాం అన్నారు. ఈ కార్యక్రమంలో బాంబ్సే అప్ నాయకులు గంజి మధు, ఫౌండేషన్ నాయకులు విప్పర్తి రాజశేఖర్, ఎస్ నాగబాబు, గాం, దీ, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



బియ్యం బస్తాలను ఆటో ద్వారా పంపుతున్న చెన్నా జనార్ధనరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఆర్గనైజేషన్ వారిచే ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నా జనార్ధనరావు ఆధ్వర్యంలో దాత వాణి సహకారంతో నెలవారి బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా 200 కేజీల బియ్యం బస్తాలను పడాల వృద్ధాశ్రమానికి, 150 కేజీలు బస్తాలను లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌కు, 300 కేజీ బియ్యం బస్తాలను నిడదవోలు లెపర్సీ కాలనీకి ఆటోలు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో చెగువేరా నివాళి

తణుకు: పేదరికం, దోపిడీ, అసమానతలు లేని సమసమాజం కోసం జీవితాన్ని ధారబోసిన చేగువేరా ఆశయసాధనకు యువత పూనుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. మార్క్సిస్టు గెరిల్లా కమాండర్, క్యూబా సోషలిస్టు విప్లవకారుడు చెగువేరా 57వ వర్ధంతి సందర్భంగా బుధవారం తణుకు సురాజ్య భవన్‌లో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ చేగువేరా ప్రపంచంలో దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిన సోషలిస్టు విప్లవకారుడని అన్నారు. దోపిడీ , అసమానతలు లేని సమసమాజ స్థాపనే ధ్యేయంగా 27 ఏళ్ల వయస్సులో తన చుట్టూ పెరుగుతున్న పేదరికం, దోపిడీలను చూసి చలించిపోయి విప్లవ పోరాట మార్గాన్ని ఎంచుకున్న చేగువేరా బాటలో యువత పయనించాలని భీమారావు కోరారు. పేదరికం, దోపిడీ, అసమానతలు లేని సమసమాజం కోసం చెగువేరా చూపిన తెగువ, సాహసం నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గార ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, నూనె రాధాకృష్ణ, జార్జి తదితరులు పాల్గొని చేగువేరాకు నివాళులర్పించారు.

ప్రత్తిపాడులో అలరించిన కూచిపూడి నృత్యం



ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయం వద్ద కూచిపూడి నృత్యప్రదర్శన

పెంటపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మంగళవారం రాత్రి నిర్వహించిన కూచిపూడి జానపద నృత్యప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా తణుకుకు చెందిన ఖ్యాతి కూచిపూడి కళాక్షేత్రంకు చెందిన చింతా రవిబాలకృష్ణ బృందం చేసిన నృత్యాలు అలరించాయి. వెంకటేశ్వరకల్యాణం, గ్రూప్ భక్తి గీతాలకు చిన్నారులు నృత్యాలతో అబ్బురపరిచారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయకమిటీ చైర్మన్ బడేటి ఉదయభాను, ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా నృత్యకళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మీనవిల్లూరు, కొండేపాడు, జట్లపాలెం, పెంటపాడు తదితర గ్రామాల్లో దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

ధాన్యం సేకరణలో అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు: రైతు సహాయక కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ, పౌరసరఫరాల శాఖ సీనియర్ ఇనస్పెక్టర్ వై. రవికుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం పెంటపాడులో సార్వా ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాలశాఖ ద్వారా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవికి పూజలు

● ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



తణుకు టౌన్: సరస్వతీదేవి అలంకరణలో దువ్వ దానేశ్వరి అమ్మవారు



తణుకు టౌన్: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు



తణుకు టౌన్: శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు



అత్తిలి: ఆరవల్లిలో సరస్వతిదేవి అలంకరణలో...



తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి అమ్మవారు



తాడేపల్లిగూడెం (టీఓసీ): సర్వమంగళఅమ్మవారు



తాడేపల్లిగూడెం (టీఓసీ): గాయత్రిదేవి



తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వదుర్గేశ్వరీ అమ్మవారు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో సహస్ర కుంకుమార్చన, చండీ పారాయణ, చండీ హోమాలు నిర్వహించారు. సరస్వతీ పూజలను జరిపారు. విద్యార్థులకు న్యాయవాది మాకా శ్రీనివాసరావు విద్యాసామగ్రిని అందజేశారు. ఆలయ ఈవో పి.హరేరాంప్రసాద్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటి అధ్యక్షుడు అన్నంనీడి ఏసుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం మండలంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో చిన్నారులతో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో యల్లారమ్మతల్లి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఆలయ ఈవో పీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని శరన్నవరాత్రి వేడుకలు సందర్భంగా గ్రామ ఆర్యవైశ్య సేవా సంఘం భవన్‌లో బుధవారం అమ్మవారిని శ్రీ సరస్వతీదేవి అమ్మవారిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రార్ధనా మందిరంలో బుధవారం సరస్వతీ దేవీగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అత్తిలి: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆరవల్లి గ్రామంలో గల శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సాయంత్రం కుంకుమ పూజలు జరిపారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అత్తిలి శ్రీ విజయచాముండేశ్వరి అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అత్తిలి బాలాజీ వెంకటేశ్వరస్వామి, ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో విద్యార్థులచే సరస్వతి పూజలు జరిపారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు ఆలయాల్లో బుధవారం అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఓం శ్రీ నీల సరస్వతీదేవి నమో నమః జ్ఞానమూర్తే నమో నమః అంటూ ఆలయాలు చిన్నారులు, విద్యార్థినీ, విద్యార్థులతో మారుమ్రోగాయి. మూలనక్షత్రం కావడంతో అమ్మవారి ఆలయాలు, ఉత్సవ పందిరిలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు, విద్యార్థులతో సరస్వతీ దేవి పూజలు చేశారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం, శంకరమఠంలోని సర్వమంగళమ్మ వారి ఆలయం, శ్రీదేవి మహంకాళి అమ్మవారి ఆలయం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో అమ్మవారు, వార్ఫ్‌రోడ్డులో ఉత్సవ అమ్మవారు, శ్రీ విశ్వదుర్గేశ్వరీ ఆలయం, గాయత్రిదేవి ఆలయం తదితర ఇతర ఆలయాలలో అమ్మవార్లను సరస్వతిదేవిగా విశేష అలంకరణలు చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుపై విచారణ



జగన్నాథపురం గ్రామంలో స్థానికులను విచారిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం పాత ఎస్సీ కాలనీకి చెందిన గెడ్డం కాంతమ్మ, ధనలక్ష్మిలు స్థానికులు తమను వెలివేశారంటూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం సాయంత్రం తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ పంచాయతీ రికార్డులను పరిశీలించి, ఆ మేరకు రహదారి నిర్మాణం చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

తణుకు టౌన్: తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 150 మంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థలు తెలిపారు. బుధవారం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో రాజమండ్రి డివైన్ ఐ ఫౌండేషన్, పరమ హంస యోగానంద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ మల్లిన అరుణ సారధి ఆర్థిక సహాయంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈశిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

జోరువానతో జలమయం



తణుకు అర్బన్: దొడ్డిపట్ల వారి వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



తణుకు అర్బన్ సజ్జాపురం వాటర్ ట్యాంకు ప్రాంతంలో రోడ్డుపై చేరిన వర్షం నీరు

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి పట్టణ ప్రాంతం జలమయమైంది. సుమారుగా గంటకుపైగా ఏకధాటిగా పడిన వర్షానికి పల్లపు వీధులన్నీ మునిగిపోయి ప్రయాణికులకు ఆటంకంగా మారింది. డ్రెయినేజీల్లో వర్షపునీరు పారుదల లేకపోవడంతో రోడ్లు, డ్రెయిన్‌లు ఏకమైపోయి మురుగునీరు రోడ్లపైకి చేరింది. దీంతో వర్షం వెలిసిన తర్వాత కూడా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తమ ప్రయాణాల్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా తణుకు రాష్ట్రపతి రోడ్డుతోపాటు బ్యాంక్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీ, ఎన్జీవో కాలనీ, పాతవూరు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం తగ్గిన అనంతరం మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీల్లో అడ్డుపడిన చెత్త, వ్యర్థాలను అడ్డు తొలగించడంతో రోడ్లపై నీటి ప్రవాహం తగ్గింది.



తణుకు టౌన్: ఉండ్రాజవరం బైపాస్ జంక్షన్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

భారీ వర్షంతో ప్రజలకు ఇబ్బందులు

తణుకు టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తణుకు పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. మంగళవారం, బుధవారం మధ్యాహ్నం కురుసిన వర్షానికి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ప్రాంగణాలతో పాటు పట్టణంలోని పైడిపర్రు డ్రైవర్ కాలనీ, పైడిపర్రు జంక్షన్, ఉండ్రాజవరం బైపాస్ జంక్షన్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయి ప్రయాణీలకు తీవ్ర ఇబ్బందులకు గురుయ్యారు. వర్షం కారణంగా ఉండ్రాజవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన కారణంగా ఇరువైపులా గోతులు పడి ప్రయాణీలకు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులు ఒకే సారి భారీ వర్షం కురవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు పడాల్సి వచ్చింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందిగా మారింది.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

● 36 దుకాణాలకు 731 దరఖాస్తులు
● గడువు పెంపుతో మరింత పెరగనున్న దరఖాస్తులు



తాడేపల్లిగూడెం: మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు గడువును ఈ నెల 11వ తేదీ వరకు పెంచారు. వాస్తవానికి బుధవారం ఈ గడువు ముగియాల్సి ఉండగా ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచింది. దీంతో ఆశావహులు మరిన్ని దరఖాస్తులు చేసుకోడానికి వెసులుబాటు వచ్చింది. గూడెం ఎక్సైజ్ సర్కిల్‌లో గూడెం నియోజకవర్గంతో పాటు గణపవరం, అత్తిలి మండలాలకు చెందిన దుకాణాలు గూడెం సర్కిల్‌లో ఉన్నాయి. మంగళవారం సాయంత్రానికి గూడెం సర్కిల్‌లోని 36 దుకాణాలకు గాను 731 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా రూ.14 కోట్ల 62 లక్షల రూపాయల దరఖాస్తు రుసుంగా వచ్చింది. తాడేపల్లిగూడెం మండలం దుకాణం నంబరు 139కి ఇప్పటి వరకు 44 దరఖాస్తులు వచ్చాయి. గణపవరం మండలం దుకాణం నంబరు 117కు 39 దరఖాస్తులు వచ్చాయి. పెంటపాడు మండలం దుకాణం నంబరు 120 నంబరు దుకాణానికి కేవలం ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అత్తిలి మండలంలో ఏడు దుకాణాలకు 131 దరఖాస్తులు వచ్చాయి. గణపవరం మండలం నాలుగు దుకాణాలకు 130 దరఖాస్తులు వచ్చాయి. పెంటపాడు మండలం ఎనిమిది దుకాణాలకు 80 దరఖాస్తులు చేశారు. గూడెం పట్టణంలో 11 దుకాణాలకు 189 దరఖాస్తులు రాగా, గూడెం మండలం ఆరు దుకాణాలకు 201 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు మరో రెండు రోజులు గడువు ఉండటంతో దరఖాస్తులు మరింత పెరిగే అవకాశాలున్నాయి. లాటరీలో దుకాణం తగిలితే ఎక్కడ పెట్టాలనే విషయంలో వ్యాపారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇష్టారాజ్యంగా వ్యాపారం చేసుకున్నా అడిగే వారు ఉండరనే ధీమాతో ఈ వ్యాపారంలోకి దూసుకొని వస్తున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో ఇసుక విక్రయం



ఎల్.అగ్రహారం గ్రామంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం ఆశయం మంచిదే అయినా క్షేత్ర స్థాయిలో విఫలమవుతుందని జిల్లా భవన నిర్మాణకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ విమర్శించారు. బుధవారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం యూనియన్ అధ్యక్షుడు దయ్యం పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ఈస ందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ అక్రమ సిండికేట్ బుకింగ్ చేసుకొని బ్లాక్‌లో ఇసుకను విక్రయిస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణాలకు ఇసుకను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఓపెన్ ర్యాంపులు ప్రారంభించడానికి అనుమతులు మంజూరు చేయాలని, ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడే సాయి బాలాజీ, గ్రామ అధ్యక్షుడు దయ్యం పాండురంగారావు మాట్లాడారు. రంగసాయి, బసిరెడ్డి సురేష్, కామిరెడ్డి జగన్, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం కార్మికులు పాల్గొన్నారు.

మగిసిన శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో గత రెండ్రోజులుగా ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా మాస్టర్ ట్రయినీ రవిచంద్ర ఉప సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణవంటి అంశాలపై శిక్షణనిచ్చారు. అనంతరం ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈవోపీఆర్‌డీ ఎం .వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

తణుకు టౌన్: గ్రామాల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాలొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో శిక్షణా తరగతుల రీసోర్స్ పర్సన్ ఎం డాక్టర్ బాబు సభ్యులకు గ్రామ పంచాయితీల ఆధ్వర్యంలో వివిధ అంశాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ లోహిత్ జయసాగర్, ఏవో వీ కృష్ణ చంద్రరావులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ వై.భవానీ శంకరి

తాడేపల్లిగూడెం: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డీఓ వై.భవానీ శంకరి కోరారు. బుధవారం చాంబర్ ఆఫ్ కామర్సులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామ రెవిన్యూ అధికారులు, రైస్ మిల్లర్స్‌కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ధాన్యం తరలింపు, రవాణా వంటి విషయాల గురించి వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీకృష్ణ, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట దాడి కేసులో ఒకరికి రిమాండ్

తణుకు: ఇటీవల తణుకు మండలం పైడిపర్రులోని స్పార్క్ హోటల్‌లో పేకాట స్థావరంపై దాడి ఘటనకు సంబంధించి ఒకరికి రిమాండ్ విధించినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. ఈనెల 7న స్పార్క్ హోటల్‌లో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి మొత్తం 45 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 1.17 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీరందరినీ కోర్టులో హాజరు పరచగా పేకాట నిర్వాహకుడు తణుకు సజ్జాపురానికి చెందిన పులవర్తి వీరవెంకట నాగతులసీరావుకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి రమణ

అత్తిలి: గ్రామ పంచాయతీలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక రూపొందించడంలో ప్రజా ప్రతినిధులు పూర్తిగా భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి రమణ అన్నారు. బుధవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ వార్షిక ప్రణాళిక రూపొందించడంపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఇచే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ ఒక అంశంపై ప్రత్యేక దృష్టిపెట్టి, దానికోసం 25 శాతం ఖర్చు చేసేలా ప్రణాళిక ఉండాలన్నారు. తొలిరోజు శిక్షణలో సాధారణ పరిపాలనా విధానం, పంచాయతీ సమావేశం, గ్రామసభలు, అధికారాలు, చెల్లింపుల విధివిధానాలు, కార్యదర్శి అధికారాలు, విధులు, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టం, సొంత ఆదాయ వనరులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఎంపీడీవో పి శ్యామ్యూల్, ఈఓఆర్డీ శ్రీనివాస్, రిసోర్సు పర్సన్‌లు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోస్టల్ వారోత్సవాలు సందర్భంగా అంత్యోదయ దివాస్ పురస్కరించుకుని తాడేపల్లిగూడెం పోస్టల్ డివిజన్ పరిధిలో యర్రమల్ల, పసివేదల, వేగేశ్వరపురం, దొండపూడి పోస్టాఫీస్‌లలో ఈ నెల 10వ తేదీన గురువారం ఆధార్ శిబిరం జరుగుతుందని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ కె.కృష్ణ వెల్లడించారు. ఆధార్ నమోదు, నవీకరణ నిర్వహించేందుకు గాను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు.

దరఖాస్తు ఫీజుల రూపంలో రూ. 10.64 కోట్ల ఆదాయం

● మద్యం షాపుల దరఖాస్తు గడువు 11 వరకు పెంపు
● తణుకు ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి వెల్లడి



ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి

తణుకు: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 33 మద్యం షాపులకుగాను బుధవారం సాయంత్రం నాటికి 532 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 11 సాయంత్రం వరకు పొడిగించినట్లు చెప్పారు. 14న లాటరీ తీసి ఈనెల 16న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం నాటికి ఇరగవరం మండలంలో నాలుగు షాపులకు గాను 114 దరఖాస్తులు రాగా పెనుగొండ మండలంలో 9 షాపులకు గాను 93 దరఖాస్తులు, పెనుమంట్ర మండలంలో 6 షాపులకు గాను 66 దరఖాస్తులు, తణుకు మున్సిపల్ పరిధిలో 9 షాపులకు గాను 129 దరఖాస్తులు, తణుకు మండలంలో 5 షాపులకు గాను 130 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. మొత్తమ్మీద దరఖాస్తు ఫీజుల రూపంలో రూ. 10.64 కోట్లు ఆదాయం వచ్చినట్లు సీఐ మణికంఠరెడ్డి వివరించారు.